

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## స్వాధీనపతిక

**గుమ్మం బయట ఉన్న అనేక రకాల చెప్పులని** చూడగానే ఆ రోజు ఇంట్లో కిట్టీ పార్టీ జరుగుతోందని గాంధీకి అర్ధమైంది. నిశ్శబ్ధంగా వెనక్కి వెళ్ళిపోదాం అనుకున్నాడు కానీ నగరాజకుమారి అతన్ని చూడనే చూసింది.

"అడుగో ఆయనే మా ఆయన డాక్టర్ గాంధీ" కొత్తగా కిట్టీపార్టీకి వచ్చిన సభ్యురాలికి పరిచయం చేసింది.

"గాంధీ మెడికల్ కాలేజ్‌లో చదివాడా?" ఎవరో సన్నగా అడిగారు. కొందరు కిసుక్కున నవ్వారు.

అదేం పట్టించుకోని నగరాజకుమారి గర్వంగా చెప్పింది.

"మనుషుల డాక్టర్ కాదు. మా ఆయన ఇంజనీరింగ్‌లో డాక్టర్. ఐ.ఐ.టి ఢిల్లీ."

కొత్త సభ్యురాలు మౌనంగా లోపలకి వెళ్తూన్న గాంధీని ఆశ్చర్యంగా చూస్తూండిపోయింది. అప్పటికే ఆమె నగరాజకుమారి ఇల్లు, ఇంట్లోని వస్తువులు, ఆవిడ ఒంటిమీది వస్తువులు ఆ వైభవం చూసి కళ్ళు తిరిగిపోయే స్థితిలో ఉంది. దానికి తోడుగా గాంధీని చూసేసరికి ఆమె కిందపడబోయి తమాయించుకుంది.

'తెల్లగా అందంగా బొంబాయ్ సినిమాలోని అరవింద్‌స్వామిలా ఉన్న ఈ ఇంజనీరింగ్ డాక్టరేట్ ఈవిడ భర్త?' హుం విధిబలీయమైంది

మొరటుగా పల్లెటూరి యాసలో మాట్లాడుతూ, గొప్పలు చెప్పుకుంటూ ఎదుటివాళ్ళని మాట్లాడనీయకుండా ఆధిపత్యం చలాయిస్తున్న నగరాజకుమారి కనీసం టెన్త్‌క్లాస్ కూడా పాసై ఉండదని అప్పటికే ఆ కొత్త సభ్యురాలు గ్రహించింది. మరి ఆవిడని ఈయన ఎలా పెళ్ళిచేసుకున్నాడో పాపం అనుకుంది.

నగరాజకుమారి పనిపిల్లని పురమాయించింది.

"అయ్యగారికి కాఫీ ఇచ్చిరా. తినడానికేమైనా కావాలేమో అడుగు."

"అయ్యో! మేము మాట్లాడుకుంటూంటాం. మీరు వెళ్ళి ఆయనకేం కావాలో చూడండి." కొత్త సభ్యురాలు మొహమాటంగా చెప్పింది. వికటాట్టహాసం చేసిన నగరాజకుమారి ఆమెని జాలిగా చూస్తూ చెప్పింది.

"నీపేరేంటి? విమల కదా? చూడు విమలా ఇలాంటి పనులు పనివాళ్ళే చేస్తారు మా కుటుంబాల్లో. అంటే, పనిమనిషిని పెట్టుకునే స్థోమత లేనివాళ్ళే చేస్తారు తప్పదుకదా."

మొదటి పరిచయంతోనే తనని ఏకవచనంతో సంబోధిస్తున్న ఆవిడ సంస్కారానికి విమల ఆశ్చర్యపోలేదు. కానీ భర్త అవసరాలు పనివాళ్ళే చూడాలి అనే ఆవిడ రాజసానికి ఆశ్చర్యపోయింది. 'మరి కాపురమైనా మీరు చేస్తారా లేక అదీ పనివాళ్ళేనా?' అందామనుకుంది కానీ "అదేమిటండీ. పొద్దుట్నించీ ఆఫీస్‌లో పనిచేసి వచ్చారు కదా. భార్య చేతి కాఫీకి, పనివాళ్ళు మొక్కుబడిగా చేసే సేవలకి తేడాలేదూ?" అడిగింది.

బెడ్‌రూంలోని గాంధీకి ఈ సంభాషణ వినిపిస్తూనే ఉంది. 'ఈ అమ్మాయికి ఇంకా గుండెకింద తడి ఉంది. ఈ బృందంలో చేరింది కాబట్టి త్వరలోనే ఎండిపోతుంది' అనుకున్నాడు.

నగరాజకుమారి ఓసారి విమలని నిశితంగా చూసింది. ఇంతసేపు ఈవిడతో మాట్లాడానే, అసలు ఈ విమలకి అందుకు అర్హత ఉందా అని ఆలోచించింది. ఎందుకైనా మంచిదని అడిగింది.

"మీ ఆయనేం చేస్తాడు విమలా?"

"ఐ.ఐ.సి.టీలో సైంటిస్ట్ అండీ."

అదేం ఉద్యోగమో నగరాజకుమారికి అర్థంకాలేదు కానీ గంభీరంగా ఉంది కాబట్టి మంచి ఉద్యోగమే అనుకుంది.

"విమల కూడా ఉద్యోగం చేస్తుంది నగరాజా. ఉస్మానియా యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్." కిట్టీ పార్టీకి విమలని తీసుకువచ్చిన పొరుగింటావిడ చెప్పింది.

అదీ గంభీరంగానే తోచింది నగరాజకుమారికి.

"మరి ఉద్యోగం చేసేప్పుడు కిట్టీ పార్టీలకి రావడానికి నీకు సెలవు దొరుకుతుందా?" తనూ గంభీరంగా అడిగింది.

"అబ్బే లేదండి. నేను మీ గ్రూప్‌లో జాయినవలేదు. పరిమళగారు సరదాగా ఉంటుంది రమ్మంటే, ఈరోజు సెలవు కాబట్టి వచ్చా అంతే" విమల గబగబా చెప్పింది.

గాంధీ నిశ్చింతగా ఊపిరి పీల్చి వదిలాడు.

ఈ అమ్మాయి మళ్ళీ మళ్ళీ కనపడదు కాబట్టి తన గొప్పదనం అంతా ఆ రోజే చెప్పక తప్పదని నిశ్చయించుకుంది నగరాజకుమారి. పైగా బాగా చదువుకున్న ఆ అమ్మాయిని తనకన్నా తక్కువ చేయాలి అంటే తన వివరాలు చెప్పక తప్పదు.

గొంతు సవరించుకుని ఉపోద్ఘాతంగా మొదలుపెట్టింది.

"చూడు విమలా..."

"నేనిక వెళ్తానండి. మావారు వచ్చేటైం అయింది" విమల లేచి నిలబడింది.

"అప్పుడేనా? కూర్చో. నేను చెప్పేది విని వెళ్ళు" అసంతృప్తిగా చెప్పింది నగరాజకుమారి.

"లేదండీ. మాకు పనివాళ్ళు లేరు. ఆయన సంగతి నేనే చూడాలి." చెప్పి విమల బయటకి నడిచింది.

"నేనూ వస్తున్నాను ఉండు. వెళ్ళొస్తాను నగరాజా" పరిమళ కూడా బయటకి నడిచింది.

"ఈ కాలంలో కూడా ఇలాంటి వాళ్ళున్నారా పరిమళగారూ?" కొంత దూరం వచ్చాక విమల ప్రశ్నించింది.

"అన్ని కాలాల్లోనూ అన్ని రకాల వాళ్ళూ ఉంటారు. లేకపోతే జీవితం బోర్‌గా ఉంటుంది విమలా" పరిమళ నవ్వింది.

"ఆ నగలేమిటండీ? కిట్టీపార్టీకే అన్ని వేసుకుందావిడ. మరి పెళ్ళిళ్ళకి ఎన్ని వేసుకుంటుందో!" విమల దిగులుపడింది. పరిమళ పకపక నవ్వింది.

"కర్ణుడికి కవచకుండలాల్లా నగరాజకుమారి ఆ నగలు లేకుండా కనపడదు విమలా."

"పాపం గాంధీగారు మంచిగా సంస్కారంగా కనిపించారు. మరి ఈవిడని ఎందుకు పెళ్ళిచేసుకున్నారో ఏమో? "

ఇతరుల విషయాలమీద ఎప్పుడూ ఆసక్తి చూపించని విమలని నగరాజకుమారి బాగా కదిలించిందని పరిమళకి అర్థమైంది.

"నగరాజకుమారి తండ్రికి గుంటూరు జిల్లాలో ఓ గ్రామంలో దాదాపు మూడువంతుల భూమి ఉంది విమలా. ఒకటే కూతురు. గారాబం. ఏడో తరగతిలో ఎవరో ఈవిడని 'నగల రాజకుమారి' అన్నారట. దాంతో 'నేనిక బళ్ళోకి వెళ్ళను' అని మానేసిందిట. కారణంగా అది చెప్పింది కానీ ఆవిడకి చదువు తలకెక్కలేదు పాపం. సినిమాల్లోలా చెట్లు, పుట్టలు పట్టుకుని పరిగెత్తుతూ చెరుకు గడలు నములుతూ, అందర్నీ ఏడిపిస్తూ పెద్దదవలేదు కానీ, తల్లి తండ్రుల సంరక్షణలో భారీగా పెరిగి యవ్వనంలోకి ప్రవేశించింది."

"భలే చెపుతున్నారే? మీకీ విషయాలన్నీ ఎలా తెలుసు?" విమల చిరునవ్వుతో అడిగింది.

"తనే చెప్పింది. నువ్వు ఇంకో అరగంట ఉంటే నీకూ చెప్పేది. అదృష్టవశాత్తూ నువ్వు వినలేదు. ఎందుకంటే, ఆవిడ మొరటు భాషలో లాగదీసి, సాగదీసి ఈ మేటర్‌ని ఓ గంటకి కంప్లీట్ చేసేది." పరిమళ కూడా నవ్వింది.

"సరే ఈ గాంధీ మహాత్ముడు ఆవిడ పాల ఎలా పడ్డాడు?"

"అలా యవ్వనంలోకి ప్రవేశించిన నగరాజకుమారికి ఓ దుర్వార్త తెలిసింది. అదేమిటంటే, తన పెదనాన్న కూతురికి పెళ్ళి కుదిరింది అంతేకాదు, అబ్బాయి డాక్టర్. ఇంకేముంది 'నాకూ డాక్టర్ కావాలి' అని ఏడుపు లంకించుకుంది. అమ్మా, నాన్నగారు కంగారు పడ్డారు. పెద్దనాన్న కూతురు డిగ్రీ చదివింది. కొంచెం నేవళంగా ఉంటుంది. కాబట్టి ఆయన డాక్టర్ని తేగలిగాడు. మరి నగరాజకి డాక్టర్ ఎలా దొరుకుతాడు? అని అమ్మా నాన్నలు కృష్ణా, గుంటూరు, ప్రకాశం, ఉభయ గోదావరులు వెదికారు. అందరికీ డబ్బు నచ్చింది. నగలు నచ్చాయి కానీ అమ్మాయి కనీసం టెన్త్‌క్లాస్ చదివి, కొంచెం ఇంగ్లీష్ అర్థం చేసుకోగలిగితే బావుండేది అన్నారు. ఇంగ్లీషేకాదు నగరాజకి తెలుగు అక్షరాలు గుర్తుపట్టడం కూడా రాదు. ఆ రోజుల్లో సెవన్త్ క్లాసకి కామన్ ఎగ్జామ్స్ ఉండి, అది పాసైతే కానీ ఎయిత్‌లోకి పంపేవారు కాదు. అందుకే ఉపాయంగా సెవెన్త్‌లో మానేసింది."

"ఓ! ఈ తెలివి తేటలు బావున్నాయి."

"అవును. ఈ లోకజ్ఞానం ఎక్కువే. ఇక వెదికి వెదికి వాళ్ళు అలసిపోయారు. నగరాజ భీష్మ ప్రతిజ్ఞలో మార్పులేదు సరికదా డాక్టరే కావాలని ఇంకా భీష్మించుకుని కూర్చుంది. అప్పుడు గాంధీగారి గురించి తెలిసింది ." సస్పెన్స్ కోసం ఓ క్షణం ఆగింది పరిమళ.

"కథ మలుపు తిరిగింది ఇక్కడేనా?" విమల ఆసక్తిగా అడిగింది.

"అవును. వాళ్ళది వీళ్ళ పక్క ఊరే. వీళ్ళ కులమే. కాకపోతే చాలా పేదవాళ్ళు. సెంటు భూమికూడా లేదు. చిన్న పూరిపాక. కానీ ఆయన చిన్నప్పటి నుంచి చదువులో చురుకు. దాంతో వాళ్ళూ వీళ్ళూ సహాయం చేయబట్టి మొత్తానికి ఢిల్లీ ఐ.ఐ.టిలో చేరాడు. నగరాజ తండ్రికి గత్యంతరం లేక వాళ్ళని కదిలించాడు. వాళ్ళు భయపడిపోయారు. గాంధీ ఒప్పుకోలేదు. కానీ ఊళ్ళో అంతా మామగారు కొండంత అండ అని నచ్చ చెప్పి ఒప్పించారు. మనుషుల డాక్టర్ కాదని నగరాజ ఒప్పుకోలేదట కానీ, ఆయన ఫోటో చూసి కాంప్రొమైజ్ అయింది. అదీకాక లోక జ్ఞానం మక్కుటంగా ఉన్న నగరాజ, అమ్మా, నాన్నలు పడే కష్టాన్ని చూసి, తనకి మనుషుల డాక్టర్ దొరకడని అర్థం చేసుకుంది కూడా. ప్రస్తుతం వీళ్ళు ఇక్కడ స్థిరపడ్డారు. ఆ ఇల్లు, సామాను పనిమనుషులు అంతా నగరాజ నాన్నగారి చలవే. గాంధీగారికి వచ్చే జీతం వీళ్ళకి పిప్పర్ మెంట్లు, బఠాణీలే. కాకపోతే హోదా. పల్లెటూర్లలో ఉండకుండా దర్జాగా, హోదాగా ఇక్కడ ఉంటోంది నగరాజకుమారి."

"మరి పిల్లలు?"

"ఇద్దరు. ఓ అమ్మాయి, ఓ అబ్బాయి. మిగిలిన విషయాలు పట్టించుకోకపోయినా గాంధీగారు ఈ విషయంలో కఠినంగా ఉన్నారు. వాళ్ళ చదువు సంధ్యలన్నీ ఆయనే స్వయంగా చూసుకుంటారు."

"అమ్మయ్యా! మరి ఆయన పేరెంట్స్?"

"వాళ్ళకి కోడలంటే ఆరాధన. ఆవిడా పాపం వాళ్ళని ఏమీ అనదు. ఆ పూరిపాకలో కూతురు ఉండలేదని తండ్రి ఓ బిల్డింగ్ కట్టించాడు. కానీ ఆవిడ ఎప్పుడూ అత్తగారింటికి వెళ్ళి ఉండలేదు. చులకన."

"అయ్యో!"

"గాంధీగారు మావారి ఫ్రెండ్ ఆయనకి ఎన్నో కలలు ఉండేవట. అమెరికా వెళ్ళి నాసాలో పనిచేయాలన్నది పెద్దకల. నగరాజ కుమారి 'చచ్చినా రాను' అని చెప్పడంతో వదిలేసాడు. తల్లితండ్రులని తనదగ్గర ఉంచుకోవాలన్నది మరోకోరిక. అదీ తీరలేదు. భార్య ఇంగ్లీష్ మాట్లాడాలి అనేది చిన్నకల. అదీ నెరవేరలేదు. నగరాజకుమారికి ఇంగ్లీష్ నేర్పిద్దామని పెళ్ళయిన కొత్తల్లో ప్రయత్నిస్తే జడుపు, జ్వరం వచ్చాయట ఆవిడకి. ఆఫీస్ పార్టీలకి గెట్ టు గెదర్‌లకి ఒక్కడే వెళ్తాడు. ఆవిడకి సింపుల్‌గా తయారవడం చేతకాదు. అక్కడ వింతజంతువులా ఉంటుంది. అదీకాక ఎవరైనా హిందీ లేక ఇంగ్లీష్‌లో ఏమైనా అడిగితే బదులు చెప్పలేదు. అదీకాక పెద్దగా తప్పించి మెల్లగా మాట్లాడటం నగరాజకుమారికి రాదు."

'హు' చిన్నగా నిట్టూర్చింది విమల.

"నిజం చెప్పాలంటే నగరాజకుమారి అనే రాక్షసి చేతిలో చిక్కిన రామచిలక పాపం ఆయన. మా వారు అంటూ ఉంటారు, 'గాంధీ ఎంత భావకుడు, ఎంత మంచి వ్యక్తి. అలాంటి వాడికి ఆ రాక్షసి ఎలా దొరికిందో పాపం' ఆఫీస్ నుంచి రాగనే ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకోవాలి అని గాంధీ కోరిక.  ఆవిడ ఎప్పుడూ ఫోన్ పట్టుకుని పెద్ద కంఠంతో గాసిప్స్ మాట్లాడుతూ వాళ్ళ మాటలు వీళ్ళకి, వీళ్ళ మాటలు వాళ్ళకి చెప్పడం తప్పించి భర్తతో సరసంగా మాట్లాడదు. అతని మాటలు ఆవిడకి 'బోర్' భార్య ఉన్నా ఏకాంతం గాంధీది. మానసిక వంటరితనం. కానీ ఆవిడని ఒక్కమాట కూడా అనడు. కారణం ఆవిడకి డబ్బుంది అనికాదు. తనకి ఇద్దరు పిల్లల్ని ఇచ్చింది అనే కృతజ్ఞత."

"గాంధీగారు నిజంగా గొప్పవారే. ఆ హోదాలో ఉన్న వ్యక్తి భార్య చాటున ఏమైనా చేయచ్చు. కానీ పాపం ఒక ఋషిలా మౌనంగా భరిస్తున్నారు."

"అవును. ఈరోజుకీ ఆయన ఆ ఇంటికి అతిథే. చదువుకునే రోజుల్లో మా వారికి చెప్పేవారుట, చిన్నఇల్లు, ఇంటిముందు తోట, ఇంటికిరాగానే కాఫీతో ఎదురొచ్చే భార్యా, పక్కనే కూర్చుని ముచ్చట్లు చెపుతూ సాంత్వనగా పగలంతా కలిగిన అలసటని పోగుడుతూ, పిల్లల కబుర్లు చెప్తూం తన సరసాలకి లలితంగా స్పందిస్తూ ఉంటే అదే స్వర్గం. ఆ స్వర్గం ప్రసాదించమని దేవుడ్ని ప్రార్థిస్తున్నా అని. కానీ ఏదీ నిజం కాలేదు. నిజానికి ఆవిడకి ఆ బంగ్లా, నగలు లాగానే డాక్టర్ భర్త ఓ స్టేటస్ సింబల్ అంతేకానీ ఏ ఎమోషనల్ అటాచ్‌మెంట్ లేదు ఆయనమీద"

ఏం మాట్లాడాలో విమలకి అర్థం కాలేదు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story